క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా సాంబయ్య



కమలాపూర్‌ : మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని గూడూరు మాజీ సర్పంచ్‌ అంకతి సాంబయ్య నియమితులైనట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా అంకతి సాంబయ్య నియమితులవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీధర్‌కు డాక్టరేట్‌



కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగ పరిశోధకుడు చింతల శ్రీధర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్టడీస్‌ ఇన్‌ ఫోటోకెటాలిటిక్‌ యాక్టివిటీ ఇన్‌ సమ్‌ రెడ్యూస్డ్‌ గ్రఫీన్‌ ఆక్సైడ్‌ ట్రాన్సిషన్‌ మెటల్‌ ఆక్సైడ్‌ కాంపోజిట్స్‌ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి శ్రీధర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పద్మజ పర్యవేక్షణలో శ్రీధర్‌ పీహెచ్‌డీ పూర్తి చేశారు.

జీటీఏ ఉపాధ్యక్షుడిగా సాంబమూర్తి


సాంబమూర్తి

కాజీపేట : ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) వరంగల్‌ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన ఉపాధ్యాయుడు పెరుమాండ్ల సాంబమూర్తి మంగళవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్‌, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రకాశ్‌ గౌడ్‌తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేతకు అన్యాయం

వరంగల్‌ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రూ.47.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో ముష్టి వేసినట్లుగా చేనేతకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగానికి కనీసం రూ.5,000 కోట్లు కేటాయించి చేనేతల అభివృద్ధికి, సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. చేనేత రంగంపై జీఎస్టీ పేరుతో వేలాది కోట్ల రూపాయలు రాబట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని కావాలని విస్మరించిందన్నారు. చేనేత రంగాన్ని కాపాడేందుకు నేతన్నలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో సవరణలు చేసి నిధులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్‌ చేశారు.

ఎంపీకి ఆహ్వానం

కరీమాబాద్‌ : వరంగల్‌ రంగశాయిపేటలో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న భూలక్ష్మీ, శ్రీలక్ష్మీ సహిత బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి రావల్సిందిగా కోరుతూ కమిటీ సభ్యులు మంగళవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఖిలా వరంగల్‌ : వరంగల్‌ శంభునిపేట విశ్వనాథకాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దర్శన్‌ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్‌ బచ్చు సింధు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్‌ కర్నె రవీందర్‌ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నేత్ర పరీక్షలు చేసి చూపు మందగించిన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఎలుగు రవీందర్‌, దేవేందర్‌, సంజీవ్‌, సతీష్‌, సుధాకర్‌, సదానందం, సంపత్‌ పాల్గొన్నారు.

రేపు ఉచిత ఫైబ్రోస్కాన్‌ వైద్యశిబిరం

కాజీపేట : కాజీపేట పట్టణంలోని లతా వెంకట్‌ ఆర్థో, జనరల్‌ కేర్‌ ఆస్పత్రిలో గురువారం ఫైబ్రోస్కాన్‌ ఉచిత స్క్రీనింగ్‌ పరీక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డా.మాధవరం శ్రీలత ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్‌, అధిక బరువు, అధిక కొవ్వు, అధిక మద్యపానం అలవాటు, మెనోపాజ్‌ తదితర సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వైద్య శిబిరంలో అవసరమైన పరీక్షలు చేసుకోవాలని కోరారు.

ఇద్దరికి కుక్కకాటు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే దేవాలయ సముదాయంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆలయానికి దైవ దర్శనం, పూజ కోసం వచ్చిన వారు వీటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఆలయానికి పూజ కోసం వచ్చిన బీజేపీ మాజీ కార్పొరేటర్‌ నార్లగిరి రామలింగం, బొడగుట్ట వాసి రాజుపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్‌
- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక దళిత కాలనీలో 15 రోజుల నుంచి తాగునీరు రావడంలేదని, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్‌ మాట్లాడుతూ.. 15 రోజుల నుంచి నల్లాల ద్వారా తాగునీరు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీఓ కార్యాలయంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మండలానికి ఇంచార్జ్‌ ఎంపీడీఓను కేటాయించారని, అతను ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొచ్చు కల్యాణ్‌, ఇస్మాయిల్‌, ఈశ్వర్‌, గణేష్‌, రాజ్‌కుమార్‌, శశాంక్‌, నవీన్‌రాజ్‌, సందీప్‌ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి వివరాలు నమోదు చేసుకోవాలి

- డీఈ సామ్యానాయక్‌


వివరాలను పరిశీలిస్తున్న సామ్యానాయక్‌

శాయంపేట : కేటగిరి–1 విద్యుత్‌ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి ఆహారభద్రత కార్డు, ఆధార్‌, మొబైల్‌ నంబర్‌తో పాటు పూర్తి వివరాలను విద్యుత్‌ సిబ్బందికి అందించాలని ఎన్పీడీసీఎల్‌ డీఈ సామ్యానాయక్‌ కోరారు. వివరాల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రజాపాలనలో గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న విద్యుత్‌ వినియోగదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బిల్లింగ్‌ మిషన్‌లో వివరాలు రానివారి ఆధార్‌ కార్డు, ఆహార భద్రత కార్డు, మొబైల్‌ నంబర్లను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 24 గ్రామాల్లో కేటగిరి–1లో 8000 విద్యుత్‌ సర్వీసులు ఉండగా.. ఈనెల 13లోపు వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ దేవేందర్‌నాయక్‌, ఏఈ రాజ్‌కుమార్‌, జేఎల్‌ఎం విష్ణు, సిబ్బంది చిరంజీవి, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ గ్రామశాఖ అధ్యక్షుడిగా సదయ్య

కమలాపూర్‌ : మండలంలోని దేశరాజుపల్లి బీఆర్‌ఎస్‌ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఒగ్గోజు సదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ సర్పంచ్‌ దాసరి రమేష్‌, ఎంపీటీసీ పసరగొండ శైలజానాగేందర్‌ తెలిపారు. హుజూరాబాద్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్‌ఎస్‌ పార్టీ యూత్‌ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు, ప్రతిఒక్కరికీ సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బాల్క సుమన్‌ బహిరంగ క్షమాపణ చెప్పాలి


ఎల్కతుర్తి : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


శాయంపేట : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


కమలాపూర్‌ : పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ..

- దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్‌ శ్రేణులు

ఎల్కతుర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్‌ శ్రేణులు డిమాండ్‌ చేశారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఆ పార్టీ శ్రేణులు హనుమకొండ–సిద్దిపేట రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సుమన్‌ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో ఎక్కడ తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఊసకోయిల ప్రకాశ్‌, చిదురాల స్వరూప, భీమన్న, పోగుల శ్రీకాంత్‌, చిట్కూరి అనిల్‌, కుడికందుల రాజు, మాడుగుల గోపి, రామోజు సమ్మయ్య, సదానందం, స్వామి, కొమురయ్య, శంకర్‌, కిరణ్‌, మోహన్‌, సురేష్‌ పాల్గొన్నారు.

కమలాపూర్‌ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్‌ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని హుజూరాబాద్‌ బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్‌, నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి పోడేటి భిక్షపతి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ ప్రభుత్వంపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బాల్క సుమన్‌ను రాష్ట్రంలో ఎక్కడ కూడా తిరుగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌ రాజు, కాంగ్రెస్‌ నాయకులు జనగాని శివకృష్ణగౌడ్‌, కొలుగూరి కుమార్‌, శనిగరపు రవీందర్‌, నరేష్‌, ఓర్సు తిరుపతి, నకీర్త అరుణ్‌, పాక శ్రీనివాస్‌, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాల్క సుమన్‌ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్‌ మాట్లాడుతూ.. బాల్కసుమన్‌ అధికారపార్టీలో ఉన్నట్లు భ్రమలో ఉండి అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సొసైటీ చైర్మన్‌ రవీందర్‌గౌడ్‌, గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకులు వాసు, సాంబయ్య రమేష్‌ పాల్గొన్నారు.

పరకాల : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్‌ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పట్టణంలో కాంగ్రెస్‌ కార్యకర్తలు నిరసనకు దిగారు. బాల్క సుమన్‌ దిష్టిబొమ్మ దహనం చేసి బస్టాండ్‌ కూడలిలో గంటపాటు ధర్నా చేపట్టారు. పట్టణ ప్రధానకార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సూర సతీష్‌, నాయకులు పోరండ్ల వేణు, మంద నాగరాజు, కొలుగూరి రాజేశ్వరరావు, రంజాన్‌అలీ, పూజారి సాంబయ్య, గోనాథ్‌, రాజమౌళి, రాజు, షఫీ, దిలీప్‌, సదన్‌కుమార్‌, అశ్రఫ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ దిష్టిబొమ్మను యూత్‌ కాంగ్రెస్‌, కాంగ్రెస్‌ నాయకులు దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సుమన్‌ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీ చంద్రప్రకాశ్‌, మాజీ సర్పంచ్‌ రవి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సుకుమార్‌, సతీష్‌, నాయకులు రవి, మార్కండేయ, రమేష్‌, కట్టయ్య, రవిపాల్‌, రాజేందర్‌, రఫీ, రాజు, చిరంజీవి, కుమారస్వామి పాల్గొన్నారు.

బస్సు సర్వీసును వినియోగించుకోవాలి


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న భీంరెడ్డి

ఆత్మకూరు : మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్థానిక బస్టాండ్‌లో రాణిగంజ్‌ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు సికింద్రాబాద్‌ డిప్యూటీ ఆర్‌ఎంఓ భీంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్‌ డిప్యూటీ ఆర్‌ఎంఓఎం సురేష్‌ చౌహాన్‌, రాణిగంజ్‌ డిపో మేనేజర్‌ లక్ష్మీధర్మాతో కలిసి ఆత్మకూరు బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రాణిగంజ్‌ డిపోకు చెందిన సుమారు 35 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కండక్టర్‌ గుండెబోయిన రమేష్‌ పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన నాయకులు


అయోధ్యకు వెళ్తున్న బీజేపీ నాయకులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం అయోధ్య రామమందిర దేవాలయ దర్శనానికి బయలుదేరారు. కాజీపేట నుంచి వెళ్లే ప్రత్యేక రైలులో వెళ్తున్నట్లు తెలిపారు. అయోధ్యకు ప్రత్యేక రైలు సదుపాయం కల్పించడం సంతోషకరమని అన్నారు. రాములవారిని దర్శించుకునేందుకు వెళ్లడం ఆనందం కలిగిస్తుందని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు రాయరాకుల మొగిలి, కానుగుల నాగరాజు, వనం నిర్మలదేవరాజ్‌, కోమటి రాజశేఖర్‌, రవి, సురేందర్‌ తదితరులు తరలివెళ్లినవారితో ఉన్నారు.

టెక్నికల్‌ హబ్‌తో వరంగల్‌ అభివృద్ధి


కాశిబుగ్గ జంక్షన్‌లో మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


మంత్రి కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్‌ నేత శ్రీరాంరాజేష్‌

కాశిబుగ్గ : వరంగల్‌ తూర్పు నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఏర్పాటు అయ్యే టెక్నికల్‌ హబ్‌తో వరంగల్‌ జిల్లా మొత్తం అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ నాయకులు మీసాల ప్రకాశ్‌, నల్గొండ రమేష్‌ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషితోనే టెక్నికల్‌ హబ్‌ నగరంలో ఏర్పాటు చేసేందుకు మంత్రి మండలి అంగీకారం తెలిపిందంటూ మంగళవారం నగరంలోని కాశిబుగ్గ, వెంకట్రామ, తెలంగాణ జంక్షన్‌లలో కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు.

ఖిలా వరంగల్‌ : టెక్నికల్‌ హబ్‌ సెంటర్‌ ఏర్పాటుకు కృషి చేసినందుకు మంత్రి కొండా సురేఖను మంగళవారం వరంగల్‌కు చెందిన కాంగ్రెస్‌ నేత శ్రీరాం రాజేష్‌, శామంతుల శ్రీనివాస్‌ హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రైల్వే గేట్‌ ప్రాంతంలో కాంగ్రెస్‌ నాయకులు మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు.

ప్రొఫెసర్‌ బాబురావుకు సన్మానం

హన్మకొండ కల్చరల్‌ : తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠాధిపతి ప్రొఫెసర్‌ భూక్య బాబురావును లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ మేరకు మంగళవారం హంటర్‌రోడ్‌లోని పీఠంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్‌ నాయక్‌, టీడీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్‌, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్‌ నాయక్‌, ఎస్టీ సెల్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్‌ నాయకుడు బానోత్‌ నవీన్‌నాయక్‌ ఇటీవల పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన భూక్య బాబురావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కేయూ ఫార్మసీ డీన్‌కు..

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్‌గా బాధ్యతలను స్వీకరించిన ఆచార్య గాదె సమ్మయ్యను తెలంగాణ గవర్నమెంట్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ బొంగు రమేష్‌, వైద్యులు సన్మానించారు.

ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- సీఐ రవిరాజు


గోడనిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఐ రవిరాజు

ఆత్మకూరు : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ రవిరాజు తెలిపారు. జాతీయ రహదారులపై నిఘా ఉంచి వాహనాలు ఆపకుండా రూట్‌ మ్యాప్‌ పాయింట్లను ఏర్పాటు చేశామని అన్నారు. మంగళవారం మండలంలోని ఆరెపల్లి క్రాస్‌ నుంచి ఆత్మకూరు మండల మహ్మద్‌ గౌస్‌పల్లి వరకు ట్రాఫిక్‌ పాయింట్లను పరిశీలించారు. ఓఆర్‌ఆర్‌ వద్ద డిస్నీల్యాండ్‌ స్కూల్‌ సమీపంలో, గూడెప్పాడ్‌ క్రాస్‌ ఎస్‌ఎస్‌ఆర్‌ హోటల్‌ సమీపం, నీరుకుళ్ల క్రాస్‌ వద్ద, కటాక్షపురం చెక్‌ పోస్ట్‌ వద్ద నాలుగు పార్కింగ్‌ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బావులకు అడ్డుగా గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దారులకు ఇరువైపుల ఉన్న పొదలు, జంగల్‌ కట్టింగ్‌ చేసి శుభ్రం చేసినట్లు తెలిపారు. కటాక్షపురం లోలెవల్‌ వంతెన వద్ద రేడియం స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. మేడారం జాతరకు రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ వలన వాహనాలు రోడ్లపై ఆపకుండా పోలీసులు పర్యవేక్షణ చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రసాద్‌, రాజేశ్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుల ధర్నా

- సీఐ జోక్యంతో సద్దుమణిగిన వివాదం


రోడ్డుపై బైఠాయించిన బాధితులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వంశీ, ఎల్తూరి పవన్‌ జనవరి 12వ తేదీన పెయింటింగ్‌ పనికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతుల కుటుంబ సభ్యులు పెయింటింగ్‌ కాంట్రాక్టర్‌ ఇంటి ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రమాదం జరిగి 25రోజులు గడుస్తున్నా స్పందించడం లేదంటూ మండిపడ్డారు. మృతుల తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌ ఎదుట గల మెయిన్‌రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న శాయంపేట సీఐ మల్లేష్‌, ఎస్సై దేవేందర్‌ బాధితులతో మాట్లాడి నచ్చజెప్పారు. చివరకు పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరుగగా బాధితులకు న్యాయం చేకూరడంతో ఆందోళన విరమించారు.

కారోబార్‌పై వెంటనే చర్య తీసుకోవాలి


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్‌ : మండలంలోని శ్రీరాములపల్లిలో జీపీ నిధుల దుర్వినియోగానికి పాలుపడ్డ కారోబార్‌ దేవులపల్లి కోటేశ్వర్‌ను విధుల నుంచి తొలగించి చర్య తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ గుండె బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారోబార్‌గా పని చేస్తున్న కోటేశ్వర్‌ గ్రామస్తుల నుంచి నల్లా, ఇంటి తదితర పన్నులు వసూలు చేసి నకిలీ రశీదులు ఇచ్చినట్లు ఆరోపించారు. వసూలు చేసిన పన్నులను జీపీలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాలుపడినట్లు తెలిపారు. దీనిపై డీపీఓకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన గతేడాది అక్టోబర్‌లో డీఎల్‌పీఓను విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. డీఎల్‌పీఓ చేపట్టిన విచారణలో తాను వసూలు చేసిన పన్నులు జీపీలో జమచేయలేదని కోటేశ్వర్‌ ఒప్పుకున్నట్లు తెలిపారు. పన్నుల దుర్వినియోగానికి పాల్పడిన కారోబార్‌కు నోటీసులు జారీ చేసి విధుల నుంచి తొలగిస్తామని డీఎల్‌పీఓ చెప్పినప్పటికీ అతనిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆతర్వాత జీపీ తీర్మానం మేరకు కారోబార్‌గా ఎండీ.ఆసీఫ్‌ను నియమించారని, జీపీ పాలకవర్గం పదవీకాలం ముగియగానే తిరిగి కోటేశ్వర్‌ను విధుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు. డీపీఓ, డీఎల్‌పీఓ, కార్యదర్శి కుమ్మక్కై కోటేశ్వర్‌ను విధుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు వెంటనే సిఫారసు చేయాలని ఈ సందర్భంగా వారు ఎంపీడీఓను బాబును కోరారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వినీల

శాయంపేట : సఖి కేంద్రం అందించే సేవలను మహిళలు వినియోగించుకోవాలని కేస్‌ వర్కర్‌ వినీల కోరారు. మండలంలోని మైలారం గ్రామంలో సర్వోదయ యూత్‌ ఆర్గనైజేషన్‌, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌ స్టాప్‌ కేంద్రం అందిస్తున్న సేవలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ.. సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశాలు, అందించే సేవలను వివరించారు. బాధితులకు కౌన్సెలింగ్‌, వైద్య, న్యాయ, పోలీస్‌ సహాయంతోపాటు తాత్కాలిక వసతి అందజేయనున్నట్లు తెలిపారు. గృహహింస చట్టం గురించి వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 181 కాల్‌ చేసి తక్షణ సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేసు వర్కర్‌ హరిత, వీఓ, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ ఆశయసాధనకు కృషి చేయాలి


నియామకపత్రం అందజేస్తున్న శద్రక్‌

కమలాపూర్‌ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లంపల్లి శద్రక్‌ అన్నారు. అంబాలలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ యువజన సంఘం గ్రామ కమిటీని మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లా వినోద్‌కుమార్‌, మండల అధ్యక్షుడు పుల్లా హేమంత్‌కుమార్‌తో కలిసి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోల్కొండ దిలీప్‌, ఉపాధ్యక్షులుగా జేరిపోతుల పృథ్వీరాజ్‌, కుమ్మరి శంకర్‌, ప్రధాన కార్యదర్శిగా మాట్ల విజేందర్‌, కార్యదర్శులుగా గోల్కొండ ఆనందరావు, కుమ్మరి కృష్ణస్వామి, సంయుక్త కార్యదర్శిగా జేరిపోతుల శివ, కోశాధికారిగా కుమ్మరి శ్రీనివాస్‌, ప్రచార కార్యదర్శులుగా గోల్కొండ భిక్షపతి, జేరిపోతుల నరేష్‌, క్రీడల కార్యదర్శిగా కుమ్మరి ఉమామహేష్‌ ఎన్నికైనట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా జేరిపోతుల రమేష్‌, గౌరవ సలహాదారులుగా జేరిపోతుల భిక్షపతి, కుమ్మరి ఏలియా, జేరిపోతుల అన్నపతి, కుమ్మరి కుమారస్వామి, జేరిపోతుల శంకర్‌, సురేష్‌, రాజు, రవి, యాదగిరి, రమేష్‌, ప్రభాకర్‌, కుమారస్వామి, నాగేశ్వర్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు.